RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 291 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 24 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-



## సీఎం రేవంత్ రెడ్డికి సవాలుగా

# ఆ రెండు సీట్లు

## గెలిచేందుకు వ్యూహాలివే..!!

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికలు పెద్ద సవాల్‌గా మారాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మెజార్టీ సీట్లు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఫలితాల్లో తేడా వచ్చిందంటే అదో పెద్ద చర్చకు దారితీస్తోంది. అందుకే పిసిసి చీఫ్‌గా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మెజార్టీ సీట్లు సాధించే పనిలో పడ్డారు. అభ్యర్థుల ఎంపిక నుంచి మొదలుకొని ప్రచారం వరకు అంతా తానే నడిపిస్తున్నారు. అయితే 17 పార్లమెంటు నియోజకవర్గం 14 సీట్లు గెలవాలనేది కాంగ్రెస్ టార్గెట్. పది నుంచి 12 సీట్లు గెలిచినా కూడా కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు గానే చూడవచ్చు అనేది కాంగ్రెస్ సర్కిల్లో జరుగుతున్న చర్చ. మెజార్టీ సీట్లు సాధించడంతోపాటు ఆ రెండు నియోజకవర్గాలు కూడా పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డికి సవాల్‌గా మారిపోతున్నాయి. అలసీఎం రేవంత్ రెడ్డి మొన్నటి వరకు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతూ వచ్చారు. ఒకరకంగా అది రేవంత్ రెడ్డికి సిట్టింగ్ సీటు. ఇప్పుడు ఆ సీటును గెలవాల్సిన అనివార్యత ఏర్పడింది. సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి మల్కాజిగిరిలో పట్టు సాధించే పనిలో పడ్డారు. మల్కాజిగిరి సీటులో గెలవడం కాంగ్రెస్‌కి సవాల్‌గా మారింది. అభ్యర్థి ఎంపికలో కూడా ఆచితూచి అడుగులు వేశారు సీఎం రేవంత్. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సమీక్ష కూడా మల్కాజిగిరి నుంచే మొదలుపెట్టారు. పార్టీ నాయకులు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిలకు గెలిచి తీరాలని తేల్చి చెప్పారు. మల్కాజిగిరి గెలిచి తీరాల్సిందేనని దిశా నిర్దేశం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిలకు పూర్తిస్థాయిలో బాధ్యతలను అప్పగించారు. నేరుగా సీఎం సమీక్షిస్తూ మల్కాజిగిరిలో పట్టు సాధించే పనిలో పడ్డారు. దేశంలోనే పెద్ద పార్లమెంటు నియోజకవర్గం కావడంతో ఆ నియోజకవర్గ పరిధిలో ఉన్న నాయకులకు పని విభజన చేసి ప్రచారంలోకి దూసుకెళ్తోంది. కాంగ్రెస్. మరోవైపు మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గంపై కూడా కాంగ్రెస్ కన్నేసింది. ఇది సీఎం సొంత జిల్లా.. దీనికి తోడు సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఈ పార్లమెంట్ పరిధిలోనే ఉన్నాయి. ఇప్పటికి కొడంగల్ నియోజకవర్గం మండలాల వారీగా సమీక్షలు రెండుసార్లు నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంటులో పూర్తిస్థాయిలో మెజారిటీ కొడంగల్ నుంచి తీసుకురావాలన్నది సీఎం ఆలోచన. దీనికి తోడు సొంత జిల్లా అవడంతో పార్టీ ఎమ్మెల్యేలు.. క్యాడర్‌ని అప్రమత్తం చేశారు. సీఎం పార్లమెంట్ పరిధిలో మెజారిటీ ఎమ్మెల్యే సీట్లు కూడా కాంగ్రెస్ గెలుచుకుంది కాబట్టి పూర్తిస్థాయిలో ఎమ్మెల్యేలకు టార్గెట్ విధించి పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గంలో జండా ఎగరాలని కసితో ఉన్నారు. ఇలా సీఎం రేవంత్ రెడ్డికి ఒకవైపు తన సిట్టింగ్ సీటు మల్కాజిగిరి ఎంపీని గెలిపించాలి.. మరోవైపు తన సొంత జిల్లాలో ఉన్న పార్లమెంటులో సీట్లను కూడా గెలిపించుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా కీలకమైన నాయకులను ఆ రెండు నియోజకవర్గాలకు ఇన్చార్జిలుగా నియమించి సీఎం సమీక్షిస్తున్నారు. త్వరలోనే పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సభలు సమావేశాలు నిర్వహిస్తూ జనంలోకి వెళ్లాలనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచన. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల్లో పట్టు సాధించే పనిలో పడ్డారు.



## ఎండ 43.3 డిగ్రీలు...

### సీజన్‌లో రికార్డు స్థాయి గరిష్ఠ ఉష్ణోగ్రత

హైదరాబాద్ : నగరంలో సూర్యుడు మళ్లీ భగ్గుమన్నాడు. నిన్న, మొన్నటిదాకా కాసింత చల్లబడిన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలుకావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు చోట్ల 40 నుంచి 43 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సరూర్‌నగర్‌లోని మారుతీనగర్‌లో రికార్డుస్థాయిలో 43.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఆదర్శ్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీలో 43, ఖాజాగూడ స్పోర్ట్స్‌కాంప్లెక్స్ 42.9 జియాగూడ,బన్సీలాల్‌పేట, సీబీసీఐడీ కాలనీలలో 42.8 డిగ్రీలు నమోదైంది.

## నిర్మల్‌లో మారుతున్న పొలిటికల్ సీన్

నిర్మల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాలకు కేంద్రబిందువైన నిర్మల్ నియోజకవర్గంలో పొలిటికల్ సీన్ మారుతున్నది. నిన్నటిదాకా అప్రతిహత పార్టీగా ఉన్న భారత రాష్ట్ర సమితి ఒక్కసారిగా నియోజకవర్గంలో కుప్పకూలింది. ప్రధాన కేడర్ అంతా ఆ పార్టీని వీడి పోతుండడంతో నియోజకవర్గంలో ఉనికి ప్రశ్నార్థకం గా తయారవుతున్నది. ఇప్పటికే నిర్మల్ పట్టణంతోపాటు ఆయా మండలాలకు చెందిన ముఖ్య క్యాడర్ అంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయింది. తాజాగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శోభ సత్యనారాయణ గౌడ్ ఆమె భర్త బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో వారు కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇది గులాబీ పార్టీకి గట్టి దెబ్బ గా భావిస్తున్నారు.

**కాంగ్రెస్ లోకి భారీగా వలసలు :** ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే నిర్మల్ మున్సిపల్ చైర్మన్ మాజీ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ 15 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు అనేకమంది మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఇలా




పెద్ద మొత్తంలోనే కాంగ్రెస్ లో చేరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి రావు వ్యూహాత్మకంగా తన రాజకీయ శత్రువైన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్య అనుచర గణాన్ని తన వైపు తిప్పుకోవడంలో సఫలమయ్యారు. దీంతో ఇంద్రకరణ్ రెడ్డి వద్ద కొన్నేళ్లుగా కొనసాగుతూ వస్తున్న ముఖ్య క్యాడర్ అంతా వెళ్ళిపోయింది. ఆయన ఏ రాజకీయ పార్టీలు చేరేది ఇంకా స్పష్టత రావడం లేదు. మరోవైపు గులాబీ పార్టీకి కూడా ఆయన దూరంగానే ఉంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన కాంగ్రెస్ లో చేరుతారని ప్రచారం జరుగుతున్నది.

**బీజేపీలోకి వలసలు మొదలు :** నిన్నటిదాకా గులాబీ పార్టీని వీడి అనేకమంది కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్న పరిస్థితి ఉంది తాజాగా. బీజేపీ వైపు కూడా కొందరు గులాబీ పార్టీ నేతలు చేరడం మొదలైంది. తాజాగా జెడ్పీ మాజీ చైర్పర్సన్ శోభారాణి ఆమె భర్త బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ సహా ముగ్గురు కౌన్సిలర్లు ఇద్దరు మాజీ కౌన్సిలర్లు కొంతమంది పార్టీ నాయకులు బీజేపీ కండువా కప్పుకున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు ఆ పార్టీని వీడి రెండు వైపులా అటు కాంగ్రెస్ ఇటు బీజేపీలో చేరడం వల్ల నియోజకవర్గంలో ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్నది.

**వ్యూహాత్మకంగానే..** గులాబీ పార్టీని వీడుతున్న నేతలు భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా వ్యూహాత్మకంగానే తమకు అనుకూలంగా ఉండే పార్టీలోకి వెళుతున్నట్లు కనిపిస్తున్నది. మైనారిటీ ఓటర్ల ప్రభావం అసలే లేని ప్రాంతాలకు చెందిన అనేక మంది నేతలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇక మైనారిటీల ప్రభావం ఉన్న నేతలు కాంగ్రెస్ లో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు. తాజాగా జరుగుతున్న పరిణామాలు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ లో రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తున్నది.

# 'షోకు సిద్ధమైన కేసీఆర్




## భారీ కాన్వాయ్‌తో బస్సు యాత్ర

హైదరాబాద్ : తెలంగాణ బ్యూరో: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ సిద్ధమవుతున్నారు. ఈ నెల 24 నుంచి రోడ్‌షోలు ప్రారంభిస్తున్నారు. అందుకు భారీ కాన్వాయి సిద్ధం చేస్తున్నారు. సుమారు వంద వాహనాలతో తరలివెళ్తున్నారు. యూనివర్సిటీ నుంచి విద్యార్థి నాయకులు, గజ్వేల్ నుంచి కూడా ముఖ్య నేతలు సైతం కేసీఆర్ వెంట వెళ్లనున్నారు. పార్టీ అధినేతకు రోడ్‌షోలో ఇబ్బందులు కలుగకుండా పార్టీ యువనేతలే వలంటీర్లుగా వ్యవహరించనున్నట్లు సమాచారం. ఆకాల వర్షాలతో పంటనష్టం జరిగినా, అత్యవసర పరిస్థితులను బట్టి రోడ్ షో రూట్ మ్యాప్‌ను ఛేంజ్ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రోడ్డు షో 17 రోజులపాటు కొనసాగనున్నది.

**17 రోజులు యాత్ర :** బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని ఇక హోరెత్తించనుంది. ఈ నెల 24 నుంచి పార్టీ అధినేత కేసీఆర్ రోడ్డుషో ప్రారంభమవుతుంది. అందుకు పార్టీ అధిష్టానం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే రోడ్డుమ్యాప్‌ను సిద్ధం చేశారు. మార్చి 10 వరకు మొత్తం 17 రోజుల పాటు యాత్ర కొనసాగనుంది. అయితే కేసీఆర్ తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బస్సుకు పూజలు చేసి స్టార్ట్ కానున్నారు. మిర్యాలగూడకు చేరుకొని సాయంత్రం 5.30 గంటలకు రోడ్డుషోను ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేసీఆర్ వెంట 100 వాహనాల్లో యువత, విద్యార్థి, పార్టీ నాయకులు తరలినున్నారు. యాత్ర ముగిసే వరకు వాహన శ్రేణి కేసీఆర్ వెన్నంటి ఉంటారు. 17 పార్లమెంటు సెగ్మెంట్లలో ఈ కాన్వాయి ప్రచారంలో పాల్గొంటుంది. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి 5 నుంచి 10 వాహనాల్లో విద్యార్థి నాయకులు తరలివెళ్తున్నారు.

ఒక్కో వాహనంలో ఐదుగురు ఉంటారని సమాచారం. పార్టీ నాయకులు సైతం ఒక్కొక్కరు 10కిపైగా వాహనాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలు సైతం కేసీఆర్ వెంట రోడ్డుషోలో పాల్గొంటారని సమాచారం. అందుకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు బసకు సంబంధించిన ఏర్పాట్లపైనా పార్టీ నేతలు నిమగ్నమయ్యారు.

**100 మందికి పైగా వలంటీర్లు :** కేసీఆర్ రోడ్డు షోలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పార్టీ అధిష్టానం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. కేసీఆర్ ప్రధానప్రతిపక్ష నేతగా ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సెక్యూరిటీ తక్కువగా ఉంది. నల్లగొండ, కరీంనగర్‌లో ఎండిన పంటపొలాల సందర్శకు వెళ్లినప్పుడు, సంగారెడ్డి సభల సమయంలోనూ జనం వచ్చి మీదపడకుండా అడ్డుకునేందుకు బౌన్సర్లను ఏర్పాటు చేశారు. అయితే వారితో ఎన్నికల సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావించిన పార్టీ చురుకైన పార్టీ యువనేతలను వలంటీర్లుగా వినియోగించుకోవాలని భావిస్తుంది. అందుకు 100 మందికి పైగా కేసీఆర్ రోడ్డు షో సమయంలో బస్సు చుట్టూ ఉండేలా చర్యలు తీసుకుంటుంది. ఎక్స్ ఆర్మీకి చెందిన వారు 50 మందితో సెక్యూరిటీ ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా పకడ్బందీ చర్యలు చేపడుతోంది.

**అత్యవసర పరిస్థితిని బట్టి రూట్ ఛేంజ్! :** రూట్ మ్యాప్ ప్రకారం కేసీఆర్ రోడ్డుషో కొనసాగుతుంది. అన్ని నియోజకవర్గాలను కలుపుతూ 17 రోజులపాటు కొనసాగనుంది. ఎక్కడైతే పార్టీ బలహీనంగా ఉంటుందో.. కేడర్ నైరాశ్యంలో ఉంటుందో అక్కడ జోష్ నింపేందుకు, కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు రోడ్డు షో కొనసాగనుంది. అయితే ప్రస్తుతం అకాల వర్షాలు వస్తున్న తరుణంలో పంటనష్టం, తోటల నష్టం జరిగితే వాటి పరిశీలన కోసం రూట్ మ్యాప్ ఛేంజ్ అవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుత రూట్ మ్యాప్ ప్రకారం ఉదయం రైతాంగ సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటన చేయనున్నారు. ఎండిన పంటపొలాల పరిశీలన, ధాన్యం కల్లాల సందర్శన, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శిస్తారు. సాయంత్రం నిర్వహించనున్న రోడ్డుషోలు, కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొననున్నారు. అత్యవసరం అయితే రూట్ ఛేంజ్ చేయనున్నట్లు సమాచారం.

**ప్రభుత్వ సెక్యూరిటీ లేదు.. మీరే అండగా ఉండాలి :** కేసీఆర్ చేపట్టే రోడ్డు షోలో విద్యార్థి నాయకులు, నాయకులు అనుసరించాల్సిన వ్యూహాలపైనా సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యార్థి నాయకులు, యువ నేతల సేవలను రోడ్డుషోలో వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. కేసీఆర్‌కు విధేయుడిగా ప్రతి ఒక్కరు పనిచేయాలని, ప్రజలు దూసుకురాకుండా అడ్డుకోవాలని, జెండా పట్టుకోవాలని సూచించారు. ప్రతి కారుకు పాసులు ఇస్తామని, ఐడీ కార్డులు కూడా జారీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. రోడ్డు షో పూర్తయ్యేవరకు కేసీఆర్ వెంటే ఉండాలని, ప్రభుత్వ సెక్యూరిటీ లేదు.. మీరే అండగా ఉండాలని కోరారు. సిద్దిపేట, మేడ్చల్, గజ్వేల్, సిరిసిల్ల నుంచి కూడా నేతలు రోడ్డు షోలో పాల్గొంటారని సూచించినట్లు తెలిసింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీ ఫ్రస్ట్రేషన్ లో ఉన్నారా? తాజా వ్యాఖ్యల మర్మమేంటి?

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే సంపద మొత్తం ముస్లింలకే.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెద్ద చర్చకే తెర తీశారు. తాజాగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన రెండో అంకం షురూ అయిన వేళ.. ఆయన నోటి నుంచి ఆ వ్యాఖ్యల లెక్కేంటన్నది ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. ఇంతకూ ప్రధాని నరేంద్ర మోడీ అసలేం అన్నారు? అన్నది ఒకటైతే.. తాజా వ్యాఖ్యల్లో ముస్లింల ప్రస్తావన తీసుకురావటం ఒక ఎత్తు అయితే.. దానికి కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆధారంగా చూపించటం ఒక ఎత్తు. ఇంతకూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఏముంది? దాన్ని మోడీ ఎలాంటి వ్యాఖ్యానాన్ని జోడించారన్న దానిపై పెద్ద ఎత్తున వాదనలు జరుగుతున్నాయి. తమకు పట్టున్న రాజస్థాన్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన నోటి నుంచి ఈ తరహా వ్యాఖ్య రావటం చూస్తే.. వ్యాఖ్యలు మొత్తం వ్యూహాత్మకమేనని చెప్పాలి. కాంగ్రెస్ ఆరోపించినట్లుగా మొదటి దశ పోలింగ్ జరిగిన 13 రాష్ట్రాల్లో ఓటింగ్ సరళి తాము అనుకున్నట్లుగా జరగకపోవటంతోనే ప్రధాని మోడీ తన మాటల డోసును పెంచారంటూ కాంగ్రెస్ మండిపడుతోంది. మొదటి దశలో 21 రాష్ట్రాల్లోని 102 లోక్ సభా స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో తమిళనాడు మొత్తం స్థానాల (39)కు ఎన్నికలు జరగ్గా.. రాజస్థాన్ లో 12, ఉత్తరప్రదేశ్ లో 8, మధ్యప్రదేశ్ లో 6, మహారాష్ట్రలో 5, ఉత్తరాఖండ్ లోని మొత్తం 5 స్థానాలకు.. అసోంలో 5, బిహార్ లో 4, పశ్చిమబెంగాల్ లో 3, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయల్లో రెండేసి చొప్పున స్థానాలు ఉన్నాయి. మొత్తం ఆరు స్థానాల్లోనే ఎన్నికలు జరిగాయి. ఛత్తీస్ గఢ్ లో 1, మిజోరం, నాగాలాండ్, సిక్కింలో ఒక్కో స్థానం ఉంది. ఈ మూడు స్థానాల్లోనూ ఎన్నికలు జరిగాయి. త్రిపురలో 1, జమ్ముకశ్మీర్ 1, అండమాన్ నికోబార్, లక్ష్యద్వీప్, పాండిచ్చేరిలో ఒక్క స్థానమే ఉండగా.. వాటన్నింటిలోనూ ఎన్నికలు జరిగాయి. రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుంది. రెండో ఫేజ్ లో అసోం.. బిహార్.. ఛత్తీస్ గఢ్.. జమ్ముకశ్మీర్..కర్ణాటక..కేరళ.. మధ్యప్రదేశ్.. మహారాష్ట్ర.. మణిపూర్.. రాజస్థాన్..త్రిపుర.. ఉత్తరప్రదేశ్.. పశ్చిమ బెంగాల్ లో జరగనున్నాయి. మొదటి దశతో పోలిస్తే.. బీజేపీకి రెండో దశ చాలా కీలకం. ఆ మాటకు వస్తే మూడో దశ కూడా ఆ పార్టీకి ముఖ్యమే. రెండో ఫేజ్ లో 89 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. మూడో ఫేజ్ లో అసోం, బిహార్, ఛత్తీస్ గఢ్,, దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ డయ్యూ, గోవా, గుజరాత్, జమ్ముకశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నిజానికి మొదటి దశ కంటే కూడా బీజేపీకి రెండు.. మూడు దశలు చాలా ముఖ్యం. దీంతో.. తమ ఓటును బ్యాంకును సమీకరించుకోవటంతో పాటు.. ముక్కలు కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వేళ.. తమ ఓటు బ్యాంక్ ను మరింత బలోపేతం చేసేందుకు వీలుగా తాజా వ్యాఖ్యలు ప్రధాని మోడీ నోటి నుంచి వచ్చి ఉంటాయని చెప్పాలి. మొదటి దశలో పోలింగ్ జరిగిన 102 ఎంపీ స్థానాల్లో సరాసరి 64 శాతం పోలింగ్ నమోదైంది. త్రిపురలో రికార్డు స్థాయిలో 80 శాతం పోలింగ్ నమోదైతే.. అతి తక్కువగా బిహార్ లో 49 శాతమే ఓటింగ్ జరిగింది. మొదటిదశతో పోలిస్తే.. మిగిలిన దశల్లో పోలింగ్ పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది. అందుకు ఏదో ఒక భావోద్వేగ అంశం కారణం కావాలి. సాధారణంగా.. తక్కువ పోలింగ్ జరగటం అధికార పార్టీకి హెచ్చరికగా భావిస్తారు. అందుకే అలెర్టు అయిన ప్రధాని.. తన మాటలతో ఎన్నికల హీట్ ను మరింత పెంచే ప్లాన్ లో భాగంగానే తాజా వ్యాఖ్యలు ఉంటాయని చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఒక మతం పేరుతో నేరుగా వ్యాఖ్యలు చేసింది లేదు. తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే.. కాంగ్రెస్ పార్టీ మైనార్టీల వైపు పూర్తిగా వాలిపోవటమే కాదు.. మెజార్టీ హిందువుల ఆస్తులపై గురి పెట్టినట్లుగా ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించటం ఇప్పుడు సంచలనంగా మారింది. ఏమైనా.. తాజాగా మోడీ చేసిన వ్యాఖ్యలు చూసినప్పుడు కాసింత ఒత్తిడిలో ఉన్నట్లుగా చెప్పాలి. తాము టార్గెట్ చేసిన 400 ప్లస్ సీట్ల సాధన కష్టంగా మారటం.. 370 స్థానాలు ఖాయమన్న మాటపై కూడా సందేహాలు వ్యక్తమువుతున్న వేళ.. తన అమ్ములపొది నుంచి భారీ అస్త్రాన్ని బయటకు తీశారని చెప్పాలి. మరీ.. మాటల మంటలు ఎంతవరకు వెళతాయన్నది ఇప్పుడు అసలు ప్రశ్న.

# మెజార్టీ రికార్డు.. సాకారమయ్యేనా!



హైదరాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ 1996లో నమోదైంది. కాంగ్రెస్ అభ్యర్థి పి.వి.రాజేశ్వర్‌రావు భాజపా అభ్యర్థి బండారు దత్తాత్రేయపై 2,14,358 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి బండారు దత్తాత్రేయ కాంగ్రెస్ అభ్యర్థి పి.వి.రాజేశ్వర్‌రావుపై 1,85,910 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్.. భాజపా అభ్యర్థి బండారు దత్తాత్రేయపై 1,70,167 ఓట్ల మెజార్టీ సాధించారు. అంతకుముందు 1987 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టి.మణెమ్మ అంజయ్య భాజపా అభ్యర్థి బండారు దత్తాత్రేయపై 92వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికల్లో బండారు దత్తాత్రేయ కాంగ్రెస్ అభ్యర్థి నాదెండ్ల భాస్కర్‌రావుపై 91,626 ఓట్ల మెజార్టీ సాధించారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థాయి మెజార్టీ రాలేదు. య హైదరాబాద్ జిల్లాలో 2019 ఎన్నికల్లో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ భాజపా అభ్యర్థి డా.భగవంతరావుపై 2,82,186 మెజార్టీ సాధించారు. 2014 ఎన్నికల్లో నమోదైన రికార్డును తానే బద్దలు కొట్టారు. ఈ ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ భాజపా అభ్యర్థి డా.భగవంతరావుపై 2,02,454 ఓట్ల మెజార్టీ సాధించారు. ఈ ఎన్నికలో 1989లో తన తండ్రి సలావుద్దీన్ ఒవైసీ మెజార్టీ రికార్డును తిరగరాశారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ తరపున బరిలో దిగిన సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ తెదేపా అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపై 1,33,078 మెజార్టీ సాధించారు.

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ తెరాస అభ్యర్థిగా బరిలో దిగిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి పటోళ్ల కార్తీక్‌రెడ్డిపై 73,023 ఓట్ల మెజార్టీ సాధించారు. మూడు ఎన్నికలు జరగ్గా ఇదే అత్యధిక మెజార్టీ. మిగిలిన ఎన్నికల్లో.. 2009లో 18,532, 2019లో 14,317 ఓట్ల మెజార్టీలు నమోదయ్యాయి.

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఇక్కడ జరిగిన తొలి ఎన్నికలో నమోదైన మెజార్టీ ఇప్పటికీ అత్యధికంగా కొనసాగుతోంది. తొలి ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణ తెదేపా అభ్యర్థి టి.భీమ్‌సేన్‌పై 93,326 ఓట్ల మెజార్టీ సాధించారు. 2014లో సీహెచ్.మల్లారెడ్డి 28,371, 2019లో ఎ.రేవంత్‌రెడ్డి 10,919 ఓట్ల మెజార్టీ సాధించారు.

# నీటి పొదుపు.. కష్టాల అదుపు



హైదరాబాద్: వేసవి కాలం ప్రారంభంలోనే నగర వాసులు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. భాగ్యనగరంలో కోటికి పైగా ఉన్న జనాభా నీటి అవసరాలు తీర్చేందుకు జలమండలి అధికారులు అవస్థలు పడుతున్నారు. నీటి వినియోగంలో జగ్రత్తలు పాటించకపోతే సంక్షోభం ఎదుర్కోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బెంగళూరులో ఆంక్షలు ఇలా.. నీటి వృథాను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం బెంగళూరులో పలు ఆంక్షలు అమలు చేస్తోంది. అవసరానికి మించి నీటిని ఉపయోగిస్తే రూ.5000 జరిమానా విధిస్తోంది. రోజువారీ నీటి వాడకంలో 20 శాతం తగ్గించుకోవాలని లేకపోతే అదనంగా వాటర్ ఛార్జీలు విధిస్తామని హెచ్చరికలు జారీ అయ్యాయి. తినడానికి పేపర్ ప్లేట్లు ఉపయోగించాలని, వాహనాల సర్వీసింగ్ చేయించుకోవడం తగ్గించుకోవాలని పేర్కొంది. ఈత కొలనుల్లో నీటిని నింపొద్దని సూచించింది.

20 శాతం నీరు వృథా.. నగరంలో రోజు విడిచి రోజు 2,547 మిలియన్ల లీటర్ల నీటిని అందిస్తుండగా.. దీనిలో 20 శాతం అంటే 509 మిలియన్ల లీటర్ల నీరు వృథా అవుతున్నట్లు గతంలో జలమండలి పరిశీలనలో స్పష్టమైంది. పాత పైపులైన్ల వ్యవస్థ లీకేజీలు, చాలా కుళాయిలకు మూతలు లేకపోవడం నీటి వృథాకు ప్రధాన కారణం. ఇటీవల ఉస్మాన్‌సాగర్ జలాశయం నుంచి నగరానికి నీటి సరఫరా చేసే లైన్‌కు హకీంపేట వద్ద లీకేజీ ఏర్పడింది.

స్వీయ నియంత్రణ అవసరం.. నీటి పొదుపులో స్వీయ నియంత్రణ అవసరం. ఇతర పనుల్లో నిమగ్నమై నల్లా నీటిని వదిలి మరిచిపోవద్దు. ట్యాంకుల్లో నీరు నిండగానే బోరు ఆపాలి. వీలైనంత వరకు వేసవిలో వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేయించకూడదు. శుభకార్యాల్లో తప్పనిసరిగా నీటి పొదుపునకు ప్రాధాన్యమివ్వాలి. వాన నీరు భూమిలోకి చేరేలా పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలి.

నగరంలో నీటి సరఫరా వ్యవస్థ..
మొత్తం పైపులైన్లు: 10 వేల కి.మీ.
మొత్తం నల్లాలు: 13 లక్షలు
రోజు విడిచి రోజు వ్యక్తికి ఇచ్చే నీరు: 150 లీటర్లు

# స్థానికేతరులకే పట్టం



మెదక్ :ఏదైనా స్థానం నుంచి పోటీ చేసే సమయంలో స్థానికత, స్థానికేతర అంశాలు చర్చనీయాంశంగా ఉంటాయి. గెలుపోటముల్లోనూ ఈ అంశం ప్రభావం చూపుతుంటుంది. చారిత్రక నేపథ్యం ఉన్న మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు గెలిచిన వారిలో నలుగురు తప్ప మిగతా వారంతా ఇతర జిల్లాల వారే కావడం గమనార్హం. 1952లో నియోజకవర్గం ఏర్పడగా, తొలి ఎంపీ ఎన్.ఎం.జయసూర్య నుంచి మొదలుకొని ఇందిరాగాంధీ వరకు, ఆ తర్వాత ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన ఆలే నరేంద్ర, విజయశాంతిలు సైతం స్థానికేతరులే. ఎన్.ఎం జయసూర్య, హన్మంత్‌రావు, సంగం లక్ష్మిబాయి సికింద్రాబాద్‌కు చెందిన వారు. 1971లో గెలుపొందిన డా.మల్లికార్జున్ స్వస్థలం మహబూబ్‌నగర్. ఇందిరాగాంధీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు కాగా, 1999లో భాజపా తరపున గెలిచిన ఆలే నరేంద్ర, 2009లో తెరాస నుంచి గెలుపొందిన విజయశాంతి హైదరాబాద్‌వాసులే కావడం గమనార్హం.

ఉమ్మడి జిల్లా నుంచి...

ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటి వరకు నలుగురే ఎంపీలుగా ప్రాతినిధ్యం వహించారు. 1984లో తెదేపా నుంచి గెలిచిన ఎంపీ మాణిక్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూర్ కాగా, 1989 నుంచి 1999 వరకు వరుసగా నాలుగు సార్లు విజయాలు సాధించిన ఎం.బాగారెడ్డి స్వస్థలం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్. 2014లో ఎంపీగా ఉన్న కేసీఆర్ స్వస్థలం సిద్దిపేట జిల్లా సిద్దిపేట గ్రామీణ మండలం చింతమడక. దుబ్బాక మండలం పోతారానికి చెందిన కొత్త ప్రభాకర్‌రెడ్డి 2014 ఉప ఎన్నికల్లో తెరాస నుంచి పోటీ చేసి విజయం అందుకున్నారు. ప్రస్తుతం బరిలో ఉన్న రఘునందన్‌రావు (భాజపా) సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ స్వగ్రామం కాగా, నీలం మధు (కాంగ్రెస్) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కూల్‌కు చెందిన వారు. భారాస అభ్యర్థి వెంకట్రామిరెడ్డి స్వస్థలం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామం. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు.

# యాసంగి పంటలకు మధ్య 'మానేరు'

బోయినపల్లి : యాసంగి పంటలకు రాజరాజేశ్వర (మధ్య మానేరు) జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. సాగు, తాగు నీటి అవసరాల కోసం దిగువన ఎల్‌ఎండీతోపాటు, కుడి కాలువ, మిషన్ భగీరథకు వదులుతున్నారు. 2023 జూన్ నుంచి జలాశయానికి 45.017 టీఎంసీల నీరు వచ్చింది. దీంతోపాటు అప్పటికే నిల్వ నీటిని కలిపి 53.772 టీఎంసీలను వదిలారు.బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రాజరాజేశ్వర జలాశయం యాసంగిలో పంటలకు ఆధారంగా మారింది. వరి నాట్లు ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు రైతుల అవసరాల మేరకు జలాశయం నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి రామడుగు మండలం గాయత్రిపంపు హౌజ్ నుంచి వరద కాలువ ద్వారా నీరు వస్తుంది. వర్షాకాలంలో మానేరు, మూలవాగుల నుంచి వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. దీంతో ఇక్కడి నుంచి దిగువన ఎల్‌ఎండీకి, కుడి, ఎడమ కాలువలు, అన్నపూర్ణ జలాశయం, గుడి చెరువు, మిషన్ భగీరథకు వెళ్తోంది. 2023 జూన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 6.012, ఎస్సారెస్పీ నుంచి 15.959, మానేరు, మూలవాగు నుంచి 23.046 టీఎంసీల వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ఇదే సమయంలో ఎల్‌ఎండీకి 41.96, అన్నపూర్ణ జలాశయానికి 4.794, కుడి కాలువకు 3.299, ఎడమ కాలువకు 0.093 టీఎంసీల నీటి విడుదల చేశారు.

తగ్గుతున్న నిల్వలు

రాజరాజేశ్వర జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో నిల్వలు తగ్గిపోతున్నాయి. జలాశయానికి ఎస్సారెస్పీ, గాయత్రి పంపు హౌజ్ నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. ప్రస్తుతం జలాశయం రెండు గేట్ల నుంచి దిగువన ఎల్‌ఎండీకి 2,500, కుడి కాలువకు 425, మిషన్ భగీరథకు 40 క్యూసెక్కులు వెళ్తోంది. జలాశయంలో గత ఏడాది మార్చిన 20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం 13.67 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. మార్చి నెలాఖరు వరకు పంటలకు నీటి విడుదల కొనసాగించనున్నారు. ఎక్కడైన రైతులు పంటల సాగు ఆలస్యంగా ప్రారంభిస్తే ఏప్రిల్ 15 వరకు విడుదలను కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

కోతల వరకు ఇవ్వాలి- వేసిరెడ్డి రాజేందర్‌రెడ్డి, రైతు, మల్లాపూర్

వరి పంటల కోతల వరకు జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలి. మానేరు వాగులో ఉన్న వ్యవసాయ బావి, బోరుపై ఆధారపడి పదెకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. సమీపంలోనే జలాశయం ఉన్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పంటలు పూర్తయ్యే వరకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలి.

మార్చి వరకు ఇస్తాం- జగన్, ఈఈ, మధ్యమానేరు

పంటల సాగుకు జలాశయం నుంచి దిగువన ఎల్‌ఎండీకి, కుడి కాలువకు నీరు వదులుతున్నాం. మార్చి నెలాఖరు వరకు నీటి విడుదల ఉంటుంది. ఆలస్యంగా పంటలు సాగు చేసిన రైతులు కోరితే ఏప్రిల్‌లో నీటి విడుదలపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకొని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

# సిద్దిపేట.. నాలుగు దశాబ్దాల కోట

సిద్దిపేట : 2008 వరకు సిద్దిపేట లోక్‌సభ స్థానంగా కొనసాగింది.. ఎంతోమంది నేతలు ఇక్కడి నుంచి గెలిచి ఎంపీలుగా కొనసాగారు. స్వరాష్ట్ర ఉద్యమ పురిటిగడ్డ కేంద్రంగా నాలుగు దశాబ్దాలకు పైగా ప్రస్థానం కలిగిన ఈ ప్రాంతం ఎన్నో విశేషాల సమాహారం. 11 మార్లు ఎన్నికలు జరుగగా.. ఐదుగురు ప్రాతినిధ్యం వహించారు. ఎస్సీ రిజర్వుడ్ పార్లమెంటరీ స్థానంగా రాజకీయ చిత్రపటంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. పునర్విభజనలో భాగంగా 2009లో ఈ స్థానం రద్దయి మెదక్‌లో విలీనమైంది.

1952లో లోక్‌సభ నియోజకవర్గాలు ఆవిర్భవించగా.. సిద్దిపేట ఎస్సీ రిజర్వుడ్ స్థానం మాత్రం 1967లో ఏర్పాటవగా.. అప్పట్లోనే తొలిఎన్నికలు జరిగాయి. ముందుగా కాంగ్రెస్ నుంచి కాకా (జి.వెంకటస్వామి) ఎంపీగా గెలుపొందారు. ముగ్గురు నేతలు రెండు, అంతకుమించిన సార్లు విజయాలు అందుకున్నారు. 2004లో చివరిసారిగా ఎన్నికల క్రతువు చేపట్టారు. 2008లో నియోజకవర్గ పునర్విభజనలో రద్దు కాగా 2009 ఎన్నికల నుంచి అమల్లోకి రావడం గమనార్హం. ఈ స్థానానికి చివరి ఎంపీగా సర్వే సత్యనారాయణ చరిత్ర



పుటల్లో నిలిచారు.

రూపు మారి..అప్పటి సిద్దిపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సిద్దిపేటతో పాటు దొమ్మాట, రామాయంపేట, నర్సాపూర్, గజ్వేల్, మేడ్చల్, కంటోన్మెంట్ శాసనసభ నియోజకవర్గాలు ఉండేవి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సమీపంలోనే ఇవన్నీ ఉన్నాయి. సైనిక సంస్థలు, కుటుంబాలు ఉండే ప్రాంతంగా కంటోన్మెంట్‌కు ప్రత్యేకత ఉంది. నియోజకవర్గాల పునర్విభజనలో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం దుబ్బాకగా రూపాంతరం చెందగా.. రామాయంపేట నియోజకవర్గం రద్దయి మెదక్ పరిధిలో చేరింది. గతంలో సిద్దిపేట ఎంపీ స్థానం పరిధిలో ఉన్న సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్‌లు ప్రస్తుతం మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్నాయి. కంటోన్మెంట్, మేడ్చల్ నియోజకవర్గాలు మల్కాజిగిరి పరిధిలోకి చేరాయి.

అనూహ్య పరిణామాలు..

2016 అక్టోబరు 11న సిద్దిపేట, మేడ్చల్ జిల్లా కేంద్రాలుగా ఆవిర్భవించిన విషయం తెలిసిందే. అభివృద్ధిలో ఈ రెండూ ప్రత్యేకతను చాటాయి. సిద్దిపేట బిడ్డ, గజ్వేల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్ రెండు మార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. ఒకప్పుడు సిద్దిపేట ద్వితీయ శ్రేణి పురపాలికగా ఉండగా.. ప్రస్తుతం ప్రత్యేక శ్రేణి హోదాతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సిద్దిపేట పట్టణం సహా 26 గ్రామాలతో సుడా (సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటైంది. గజ్వేల్, నర్సాపూర్ 2016లో డివిజన్ కేంద్రాలుగా ఏర్పాటయ్యాయి. గజ్వేల్ సహా దుబ్బాక, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ పురపాలికలుగా అవతరించాయి.

కాంగ్రెస్ సీనియర్ నేత నంది ఎల్లయ్య గరిష్ఠంగా ఐదుసార్లు ఎంపీగా విజయం సాధించారు. కాంగ్రెస్ నేత కాకా, తెదేపా నేత మల్యాల రాజయ్య రెండుమార్లు చొప్పున గెలుపొందారు. తెదేపా నేత విజయరామారావు, కాంగ్రెస్ నేత సర్వే సత్యనారాయణ ఒక్కోసారి ప్రాతినిధ్యం వహించారు.

# అందని భత్యం.. పేదలపై భారం

పెద్దశంకరంపేట : పేద విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రభుత్వం వారికి రవాణా భత్యం అందజేస్తోంది. ఈ భత్యం విద్యార్థులకు సకాలంలో విడుదల కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బస్సు సౌకర్యం లేని పలు గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో, కాలినడకన వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. ఇతర గ్రామాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లిస్తోంది. అయితే రెండేళ్లుగా ఈ భత్యం బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.కూలీ పనులు చేసుకొని.. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని మొత్తం 890 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 86,238 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో కస్తూర్బా మినహా మిగతా అన్ని పాఠశాలలకు విద్యార్థులు ఇళ్ల నుంచి వచ్చి వెళ్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారంతా ఎక్కువ శాతం పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారే. బస్సు సౌకర్యం లేని ఇలాంటి చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కూలి పనులు చేసుకొని బతుకే భారంగా గడుపుతున్న తల్లిదండ్రులకు ప్రతిరోజు ప్రయాణ ఛార్జీలు చెల్లించి పిల్లలకు పాఠశాలలకు పంపడం ఇబ్బందిగా మారుతోంది. దీంతో ప్రభుత్వం విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయాణ భత్యం ఇస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు.. ప్రయాణ భత్యాన్ని పొందేందుకు ఒక కిలోమీటరు దూరం ఉన్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, మూడు కిలోమీటర్లు దూరంగా ప్రాథమికోన్నత విద్యార్థులు, ఐదు కిలోమీటర్లు దూరంగా వెళ్లి చదివే ఉన్నత స్థాయి విద్యార్థులు అర్హులు. 1-5 తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.4 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల వారికి రూ.6 వేలు చెల్లించాలి. ఏడాదిలో పది నెలలకు మాత్రమే ఈ భత్యాన్ని అందిస్తారు. అర్హత గల విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలను సమగ్ర శిక్షా అభియాన్‌కు అందిస్తే విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపితే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. మెదక్ జిల్లా వ్యాప్తంగా 86,238 మంది విద్యార్థులు చదువుతుండగా ఇందులో 2022-23 విద్యా సంవత్సరానికి 1224 మంది విద్యార్థులకు రూ.67.86 లక్షలు, 2023-24 విద్యా సంవత్సరానికి 1144 మంది విద్యార్థులకు రూ.63.58 లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 23తో విద్యా సంవత్సరం ముగియనుండగా ఇప్పటికీ గతేడాది, ఈ ఏడాదికి సంబంధించిన రవాణా భత్యం విడుదల కాలేదు. విద్యా సంవత్సరం ముగియనుండటంతో ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. రెండేళ్లుగా విద్యార్థులకు భత్యం విడుదల కాకపోవడం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.ప్రతిపాదనలు పంపాం: జ్యోతి, సెక్టోరియల్ అధికారిగత రెండేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన రవాణా భత్యం పెండింగ్‌లో ఉంది. వీటిపై ప్రతిపాదనలు పంపడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతాయి. అర్హులైన విద్యార్థుల బ్యాంకు ఖాతాల వివరాలు పాఠశాలల హెచ్‌ఎంలు సకాలంలో అందించడం లేదు. దీనివల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడతాయి.

బ్యాంకు ఖాతాల సేకరణలో జాప్యం ఈ ఏడాది 1144 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించారు. ఇందులో సుమారు 700 మంది విద్యార్థులకు సంబంధించి బ్యాంకు ఖాతాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు పంపలేదు.

# ఏపీలో ఎమ్మెల్యే అభ్యర్థి యాభై కోట్లు పెట్టే స్తోమత ఉండాలా...?

ఎన్నికలు అంటే ఇదివరకులా లేవు. ప్రజాస్వామ్యం అంతకంతకు ధనస్వామ్యంగా మారుతోంది. కోట్లు తీస్తేనే తప్ప రాజకీయం సాగడం లేదు ఒకపుడు అంటే అన్న గారి టీడీపీ టైం లో జస్ట్ నామినేషన్ ఖర్చులు పెట్టుకుంటే చాలు హ్యాపీగా ఎమ్మెల్యే ఎంపీ అయిపోయేవారు. ఆ తరువాత మాత్రం తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదు అయిపోయాయి. పాతికేళ్ళుగా సాగుతున్న ఈ రకమైన ట్రెండ్ ఇపుడు అంతకంతకు ఎన్నికల ఖర్చుని పెంచేస్తూ ఒక ఎమ్మెల్యే పోటీ చేయాలంటే యాభై కోట్లు బడ్జెట్ ని వెచ్చించాల్సిందే అన్నట్లుగా మారింది అని అంటున్నారు. అలా ఆలోచిస్తే ఏపీలో 2024 ఎన్నికలు అత్యంత ఖరీదైన ఎన్నికలుగా మారబోతున్నాయని అంటున్నారు. అది టీడీపీ అయినా లేక వైసీపీ జనసేనల నుంచి అయినా ఎమ్మెల్యేగా పోటీ చేయాలీ అంటే వారి దగ్గర యాభై కోట్లు ఉంటేనే సీటు వచ్చే చాన్స్ ఉంది అని అంటున్నారు. ప్రజలు కూడా ఈసారి ఎన్నికల హడావుడి హెూరాహెూరీ పోటీ చూసి చాలానే ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు అని అంటున్నారు. దానితో పాటు ఖర్చుకు కూడా ఎన్నిక ఎన్నికకూ బాగా పెరిగిపోతున్నాయి. మారుతున్న కాలంలో సోషల్ మీడియా కూడా అతి ముఖ్య పాత్ర పోషిస్తోంది. దాంతో ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరైనా కేవలం సోషల్ మీడియాలో ప్రచారానికే మూడు నుంచి నాలుగు కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోంది అని అంటున్నారు. ఇక ఓటుకు ఒకపుడు అయిదు వందల రూపాయలు ఇచ్చేవారు అని ప్రచారంలో ఉండేది. ఆ రోజులకు అది గొప్పగానే ఉంది. కానీ నంద్యాల ఉప ఎన్నికల తరువాత ఓటు రేటు బాగా పెరిగిపోయింది అని అంటున్నారు. వేలల్లోకి వచ్చేసిందిట. దాంతో 2024లో ఓటుకు రెండు వేల రూపాయలు ఖర్చు చేయాలని కొత్త లెక్కలు తీస్తున్నారు. ఒక నియోజకవర్గంలో సుమారు లక్షన్నర మంది ఓటర్లు ఉంటే కనుక ఈ లెక్కన వేసుకుంటే దానికే ఏకంగా ముప్పయి కోట్ల రూపాయలు చాలా సులువుగా పోతుంది అని అంటున్నారు. ఇక మండలాలు గ్రామాలలో నాయకుల జంపింగులకు, అలాగే పంపకాలకు మరో ఆరేడు కోట్లు ఖర్చు అవుతుంది అని లెక్క వేస్తున్నారు. ఇవన్నీ దాటుకుని ప్రచారం నిర్వహించి పోలింగ్ దాకా కథ వస్తే పోలింగ్ ఏజెంట్ల కోసం ప్రతీ ఒక్క పోలింగ్ స్టేషన్ కి కనీసంగా యాభై వేల రూపాయల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇలా కనుక చూసుకుంటే అన్నీ కలుపుకుని కచ్చితంగా యాభై కోట్ల రూపాయలు దాకా ఖర్చు అవుతుందని అంటున్నారు. యాభై కోట్లు చేతిలో పట్టుకోకుండా ఎన్నికలను చేయలేమని అన్ని పార్టీలలోని ఆశావహులు అభ్యర్థుల రేసులో ఉన్న వారు అంటున్న మాట ఇది. తీరా ఇన్ని రకాలైన ఆర్థిక ఇబ్బందులను తట్టుకుని యాభై కోట్లను తీసి ఖర్చు పెట్టి ఎమ్మెల్యే అయినా ఆ పదవికి గౌరవం విలువా ఉన్నాయా అంటే అది లేదు అని అంటున్నారుట. దాంతో ఎందుకొచ్చిన ఎమ్మెల్యే పదవి అని చాలా మంది అనుకుంటున్నారుట. నిజానికి దేశంలో కెల్లా ఎన్నికల ఖర్చు ఎక్కువగా తెలుగు రాష్ట్రాలలోనే ఉంది. అందులోనూ ఏపీలోనే ఉంది. ఏపీలో చాలా కాలం నుంచే ధన ప్రభావం ఎన్నికల మీద పడడం జరిగింది. ఇక్కడ హంగూ ఆర్భాటం ఎక్కువ. దానికి తోడు పోటీ తత్వం ఎక్కువ. ఎన్నికలను చాలా ప్రస్టేజి గా సవాల్ గా తీసుకుని అభ్యర్థులు పోటీలు పడి మరీ పెంచేసి ఈ స్థితికి తెచ్చారని అంటున్నారు. ఈ సందర్భంగా ఒక ముచ్చట చెప్పుకోవాలి. ఎన్టీయార్ టీడీపీ పెట్టినపుడు చాలా మంది విద్యావంతులను మేధావులను ఎంపిక చేసి టికెట్లు ఇచ్చారు. వారి మొత్తం ఎన్నిక ఖర్చు ఆ రోజుల్లో కేవలం పది వేల రూపాయలుగా ఉందని చాలా మంది ఈ రోజుకీ చెప్పుకుంటారు. ఆ రోజులలో ప్రజలు కూడా ఏమీ ఆశించేవారు కాదు అలాగే పార్టీ కార్యకర్తలు కూడా గెలుపు కోసం తమ శక్తినే చమటగా మారుస్తూ వెళ్లేవారు. ప్రచార ఆర్భాటాలు కూడా తక్కువ. దాంతో ఎన్నికల ఖర్చు చాలా నామమాత్రంగా ఉండేది. పైపెచ్చు ఆ రోజులలో ఎమ్మెల్యే అంటే ఎంతో గౌరవం మర్యాద ఉండేవి. ఇపుడు కాలం మారింది అన్నీ పెరిగిపోయాయి. విలువలు తరిగిపోయాయని అంతా నిట్టూరుస్తున్న పరిస్థితి ఉంది.

# పర్యవేక్షణ శూన్యం.. ట్యాంకులు అధ్వానం



తాండూరు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత. ఇందుకోసం పంచాయతీ మొదలు మున్సిపాలిటీల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. కానీ ఈ పరిస్థితి జిల్లాలో కానరావడంలేదు. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి ఉచితంగా సరఫరా చేసున్న తాగునీరు గొంత తడపలేకపోతోంది. ప్రజలు తాగునీటికి ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడుతున్నారు. దీనికి సంబంధించి కథనం.

గాడి తప్పుతున్న భగీరథ లక్ష్యం

జిల్లాలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ఐదేళ్ల క్రితం ప్రారంభించారు.

పరిగి, వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల పరిధిలోని 974 గ్రామాలకు పరిగి మండలం రాఘవాపూర్ సమీపంలోని నీటిశుద్ధి కేంద్రం నుంచి భగీరథ నీటి సరఫరా జరుగుతోంది. కనీసం ప్రతి పదిహేను రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలి. పంచాయతీల్లో సిబ్బంది కొరత, కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారుతోంది. సమయానుకూలంగా శుభం చేయకపోవడం, క్లోరినేషన్ పూర్తిగా మరిచిపోవడంతో తాగేనీటిలో చెత్తా చెదారంతో పాటు నాచు వస్తోందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కావడంతో ట్యాంకుల శుభ్రత తప్పసరి అని స్వయంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులే చెబుతున్నారు. అయినా కార్యదర్శులు తగినంత దృష్టి సారించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

ప్రభుత్వం భగీరథ నీటి విషయంలో సందేహాలు వద్దని చెబుతోంది. కానీ శుభ్రత విషయంలో ఆందోళనతో చాలా మంది ఆ నీటిని తాగడానికి ముందుకు రావడంలేదు. ఇళ్ల శుభ్రతకు, దుస్తులు ఉతకడానికి తదితర అవసరాలకు ఎక్కువగా వాడుతున్నారు.

కొన్నిచోట్ల నెలకు.. మరికొన్ని చోట్ల రెండు నెలలకోసారి

తాండూరులో తాగునీటి సరఫరా ట్యాంకుల పరిశుభ్రత అంతంత మాత్రంగానే ఉంది. కొన్నిచోట్ల నెలకు, మరికొన్నినెలకో..రెండు నెలలకోసారి శుభ్రం చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో శుభ్రత లోపించిన నీటిని తాగితే వ్యాధుల బారిన పడే వీలుంది. ట్యాంకులను ఎప్పుడు శుభ్రం చేసింది? తిరిగి మళ్లీ ఎపుడు శుభ్రం చేయాలనే విషయంలో ప్రత్యేకంగా నామఫలకంపై రాయాలి. కానీ దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

తాండూరు పట్టణంలో 71వేల మంది జనాభాకు తాగునీటిని సరఫరా చేసే 8 ట్యాంకులు ఉన్నాయి. వీటి నుంచి 9 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నా అనేకచోట్ల శుభ్రత కానరావడంలేదు.

వికారాబాద్ మున్సిపల్ డివిజన్లో ట్యాంకుల శుభ్రత మరిచిపోయారు. ట్యాం కులు పాతవి కావడం, పర్యవేక్షణ లోపం ఫలితంగా పలుచోట్ల మట్టి, వాసనతో కూడిన నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం పెరుగుతున్న ఎండలను, తాగునీటి అవస్థలను దృష్టిలో పెట్టుకునైనా ట్యాంకుల శుభ్రత చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ పథకం ప్రారంభం...2018

వెచ్చించిన మొత్తం.. రూ.402 కోట్లు

ట్యాంకుల నిర్మాణం.. 402

పైప్‌లైన్‌ల ఏర్పాటు..1920 కి.మీ.

కుళాయి కనెక్షన్లు.. 1.98 లక్షలు

ప్రస్తుతం ట్యాంకుల శుభ్రత.. 40 శాతం లోపే..

# ప్రచార వ్యయంపై నిఘా

పెద్దపల్లి : లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అంతటా నామినేషన్ల కోలాహలం నెలకొంది. ప్రస్తుతం నామపత్రాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుండగా అభ్యర్థులు ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రోజువారీ ఖర్చు వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థి రూ.90 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయరాదని సూచించింది. గతంలో ఇది రూ.70 లక్షలుగా ఉండేది. అభ్యర్థుల వెంట నిఘా బృందాలు నీడలా వెంటాడుతున్నాయి. ప్రచార సరళి, సభలు, సమావేశాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.

నామినేషన్ నుంచి లెక్కింపు వరకు..

అభ్యర్థుల ర్యాలీలు, ప్రచారాలు, సభలు, సమావేశాలు, భోజనాలు, వాహనాలు ఇతర అవసరాలకు సంబంధించి ఖర్చులను అధికారులు పక్కాగా లెక్కిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి అభ్యర్థికి రూ.90 లక్షలలోపు ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీనికి సంబంధించి ఇప్పటికే పార్టీల సమక్షంలో స్థానిక ధరలకు అనుగుణంగా



ఆమోద ముద్ర చేశారు. నామినేషన్ దాఖలు నుంచి ఓట్ల లెక్కింపు వరకు అభ్యర్థి వెచ్చించే ప్రతి పైసాకూ లెక్కలు చూపాల్సిందే. నామినేషన్ వేయడానికి ఒక రోజు ముందు తెరిచిన బ్యాంకు ఖాతాలో అభ్యర్థుల ఎన్నికల లావాదేవీలను నమోదు చేయాల్సి ఉంటుంది.

నిఘా బృందాల పర్యవేక్షణ

ఎన్నికల్లో డబ్బు, ఇతర ప్రలోభాలు నియంత్రించేందుకు ప్రతి శాసనసభా నియోజకవర్గానికి స్టాటిక్ సర్వే లెన్స్, వీడియో సర్వే లెన్స్, వీడియో వీవింగ్, ఎంసీసీ బృందాల ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. అభ్యర్థుల వెంట షాడో బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. సభలు, సమావేశాలకు అవసరమైన టెంట్, కుర్చీలు, సమకూర్చిన వాహనాలు, ఇతర సామగ్రి, ప్రచార కార్యక్రమాలు.. ఇలా ప్రతి అంశాన్నీ వీడియోలో చిత్రీకరిస్తున్నారు. అభ్యర్థుల ఖర్చులను వ్యయ బృందాలు మూడు సార్లు తనిఖీ చేస్తుంటాయి. వీడియో చిత్రీకరించిన, అభ్యర్థులు నివేదించిన వాటిలో వ్యత్యాసం ఉంటే నోటీసులు జారీ చేస్తారు.

# ఎన్‌ఫోర్స్‌మెంట్ బండి.. దోపిడీ దండి




హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని పలు ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాలు అక్రమ వసూళ్లకు కేంద్రంగా మారాయి. అధికారులు, సిబ్బంది వేధింపులతో చిరు వ్యాపారులు, నిర్మాణదారులు, దుకాణదారులు సతమతమవుతున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాలు కేంద్రంగా చలాన్ల మాయాజాలం నడుస్తోంది. రూ.50వేల జరిమానా వేస్తామంటూ వ్యాపారులను బెదిరించడం, చివరకు రూ.500 చలానా రాసి, రూ.10వేల నుంచి రూ.20వేలు లంచం తీసుకోవడం ఉద్యోగులకు పరిపాటిగా మారింది.

వాహనాలు ఎందుకంటే..?జీహెచ్ఎంసీ పరిధిలో 30 సర్కిళ్లు ఉండగా, సర్కిల్‌కు ఓ ఎన్‌ఫోర్స్ మెంట్ వాహనం పనిచేస్తోంది. అందులో డ్రైవరు, సూపర్‌వైజరు, ఇద్దరు కార్మికులు ఉంటారు. రోడ్లపై చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేసినా, ఫ్లెక్సీలు కట్టినా.. ఇతరత్రా ఉల్లంఘనలపై ఆయా వాహనాల సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సర్కిల్ సహాయ వైద్యాధికారి(ఏఎంవోహెచ్), ఉప కమిషనర్ పర్యవేక్షణలో ఇవి పనిచేస్తాయి.

ఇవిగో ఉదాహరణలు..

ముషీరాబాద్ సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనానికి సంబంధించిన చలాన్ల డబ్బును అధికారి నెలరోజులుగా ట్రెజరీలో చెల్లించలేదు. గతంలో ఇక్కడే ఓ ఉన్నతాధికారి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడిన ఉదంతంపై కథనాలు ప్రచురించినా.. యంత్రాంగం తీరు మారలేదు. ఈ అక్రమ వసూళ్లకు ట్రెజరీ అధికారులు, సర్కిల్ డీసీల మద్దతు ఉందనే ఆరోపణలున్నాయి.

అధికార దుర్వినియోగం ఇలా..

ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాల్లోని ఉద్యోగులు, సిబ్బంది.. ఉన్నతాధికారుల అండతో రెచ్చిపోతున్నారు. కొందరు ఏఎంవోహెచ్‌లు నకిలీ చలాన్లు సృష్టించి రోజూ రూ.లక్షకుపైగా వసూలు చేస్తుండగా, మరి కొందరు.. దుకాణదారులనుంచి నెలవారీ తీసుకుంటున్నారు.తోపుడుబండ్లు, కిరాణా దుకాణాలను తనిఖీచేసి, ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నందున రూ.50వేల జరిమానా కట్టాలని బెదిరించడం, వ్యాపారి ఇచ్చే ముడుపులు తీసుకుని వదిలేయడం కొందరు ఏఎంవోహెచ్‌లకు పరిపాటిగా మారింది.స్థానికంగా హెూటళ్లపై వచ్చే ఫిర్యాదులనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాలు వసూళ్లకు వాడుకుంటున్నాయనే ఫిర్యాదులున్నాయి. అధికారం లేకపోయినా.. సిబ్బంది హెూటల్‌కు వెళ్లి, ఫొటోలు తీసి హల్‌చల్‌చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దుకాణం పేరుతో రోడ్డుపై పెట్టేబోర్డులనూ సిబ్బంది లక్ష్యంగా చేసుకుంటున్నారు. జరిమానా పేరుతో బెదిరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

# నత్తలా నడిచి.. నిర్మాణంలోనే నిలిచి..

భైంసా : గూడులేని పేదలకు గత ప్రభుత్వం రెండు పడకగదుల ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు వెచ్చిస్తూ ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణానికి పూనుకుంది. నిర్మాణ పనులను గుర్తింపుగల సంస్థలు, పేరున్న గుత్తేదారులకు టెండరు ద్వారా అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోవని పనులు ప్రారంభించ లేదు. అదనంగా రూ.లక్ష ఇస్తేనే ఇళ్లు నిర్మిస్తామని పేచీ పెట్టారు. దీంతో స్థానిక నాయకులు నిబంధనలకు విరుద్ధంగా తమకు అనుకూలమైన లబ్ధిదారులను ముందే ఎంపిక చేసి వారి ద్వారా రూ.లక్ష వరకు ఇప్పించినట్లు తెలిసింది. ఏదైమైనా ఇల్లు వస్తుందన్న ఆశతో అప్పులు చేసి అదనపు సొమ్ము ముట్టజెప్పిన పేదలకు ఇప్పటికి రెండు పడకగదుల ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. పలు చోట్ల గృహ సముదాయ నిర్మాణానికి స్థలం కొరత ఉండగా.. ప్రభుత్వ స్థలాల్లో పూరిళ్లలో ఉన్న వారికి రెండు పడక గదుల ఇల్లు ఇస్తామని చెప్పి ఖాళీ చేయించారు. ఆశతో స్థలం ఇచ్చిన పేదల నీడ పోయినా గూడు దక్కని పరిస్థితి నెలకొంది. ఇప్పటికి ప్రభుత్వం ఈ పథకానికి రూ.కోట్లు వెచ్చించగా ఫలితం లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాధనం వృథా కాకుండా వాటిని పూర్తి చేస్తే పేదలకు మేలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పూర్తయినవి పంపిణీకి నోచుకోక..

జిల్లాలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయడం లేదు. ఇప్పటికే



కొందరు అప్పులు చేసి గుత్తేదారులకు రూ.లక్ష వరకు అందించారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో స్థానిక రాజకీయాలు మారాయి. దీంతో డబ్బులు ఇచ్చిన తమకు ఇల్లు వస్తుందో లేదోననే ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో 3,246 ఇళ్లు పూర్తికాగా 2,110 మాత్రమే పంపిణీ చేశారు. మిగతా ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది.భైంసా మండలం కామోల్‌లో 26 ఇళ్లు మంజూరు కాగా నిర్మాణానికి స్థలం లేక అక్కడ పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఎంపిక చేశారు. నలుగురు పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి వాళ్ల రేకుల ఇళ్లను తొలగించి నిర్మాణం చేపట్టారు. జీ ప్లస్ వన్ భవన నిర్మాణ సముదాయం ప్రారంభించి డబ్బులు సరిపోవని గుత్తేదారు పేచీ పెట్టారు. దీంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వసూలు చేశారు. ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇచ్చిన వారి నుంచి రూ.50 వేలు తీసుకున్నట్లు సమాచారం. మూడేళ్లు కావొస్తున్నా నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో స్థలం ఇచ్చిన పేదల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. ప్రస్తుతం అద్దెకు ఉంటున్నారు. ఇంటి కోసం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నారు.

కుభీరు మండలం రాజూరు శివారులో సుమారు 23 రెండు పడకగదుల ఇళ్లను మంజూరు చేశారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన నిర్మాణాలు స్లాబు వరకు పూర్తి చేశారు. ఇక్కడ సైతం స్థలం కొనుగోలు పేరిట లబ్ధిదారుల నుంచి రూ.లక్ష తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా బిల్లులు అందక పనులు నిలిపేశామని గుత్తేదారులు చెబుతున్నట్లు లబ్ధిదారులు అంటున్నారు.

పనులు పూర్తి చేస్తాం:

జె.నర్సయ్య, డీసీవో, నిర్మల్

అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తాం. మంజూరైన పనులపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. పూర్తయిన వాటి పంపిణీ కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# శివారు.. లేఅవుట్ల జోరు!

మహబూబాబాద్ : నగర శివార్లలో అక్రమ లేఅవుట్లు జోరుగా వెలుస్తున్నాయి. రెండు, మూడు ఎకరాల చొప్పున ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్లు, టౌన్‌ప్లానింగ్ క్షేత్రస్థాయి ఉద్యోగులను మచ్చిక చేసుకొని అక్రమ వెంచర్లు వేస్తున్నారు. అనధికార లేఅవుట్లతో గ్రేటర్ వరంగల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బల్దియా పట్టణ ప్రణాళిక విభాగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అనుమతిలేని లేఅవుట్లపై చర్యల పేరుతో పెద్దఎత్తున మామూళ్లు వసూలు చేస్తున్నారని తెలిసింది. ఇటీవల ఖమ్మం జాతీయ రహదారికి సమీపంలో బొల్లికుంట విలీన గ్రామ శివారులో అక్రమ లేఅవుట్ హద్దురాళ్లను అధికారులు తొలగించారు. దీనికి సమీపంలో ఉన్న మరో రెండు, మూడు చిన్న లేఅవుట్లపై చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఫిర్యాదు చేస్తే తప్ప గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ కదిలే పరిస్థితి లేదంటున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల చేతివాటంతో అనధికార లేఅవుట్లు పెరుగుతున్నాయి.

ఎక్కడెక్కడంటే..వరంగల్ ప్రాంతంలోని బొల్లికుంట, నక్కలపల్లి, దూపకుంట, వసంతపూర్, స్తంభంపల్లి, మామునూరు, తిమ్మాపూర్, అమ్మవారిపేట, సింగారం, ధర్మారం, గొర్రెకుంట, జాన్‌పాక, పోతరా



జుపల్లి, ఎనుమాముల, పైడిపల్లి, కొత్తపేట, ఆరెపల్లి తదితర విలీన గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు 15–20 వరకు ఉంటాయని తెలిసింది. చాలా వరకు 2–4 ఎకరాల్లోపు చిన్నాచితక వెంచర్లు ఉన్నాయి.

హనుమకొండ ప్రాంతంలో భట్టుపల్లి, కడిపికొండ, కుమ్మరిగూడెం, తరాలపల్లి, మడికొండ శివారు, రాంపూర్, కోమటిపల్లి, భీమారం శివారు, గోపాల్‌పూర్ శివారు, ఎల్లాపూర్, హసన్‌పర్తి, ముచ్చర్ల, పెగడపల్లి, గుండ్లసింగారం, వంగపహాడ్ గ్రామాల్లో 20–25 వరకు అనధికార లేఅవుట్లు ఉన్నాయని తెలిసింది.

విలీన గ్రామాల్లోని కొందరు కార్పొరేటర్లు అక్రమ లేఅవుట్లకు అండగా ఉంటున్నారని తెలిసింది. టౌన్‌ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయి ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.లేఅవుట్ నుంచి రూ.2–3 లక్షల వరకు చేతులు మారుతున్నాయని తెలిసింది. ఇందులో అందరికీ వాటాలు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# జాప్యం నెలకొని... అంచనాలు పెరిగి

వేములవాడ : ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణంలోని మూలవాగులో 2015 సంవత్సరంలో రెండు వంతెనల నిర్మాణానికి, వాటి వద్ద కూడళ్ల అభివృద్ధికి అంచనాలు తయారు చేశారు. అప్పుడు చేసిన అంచనాలతో పనులు మొదలు పెట్టగా పడమర వైపు వంతెన నిర్మాణం పూర్తయింది. తూర్పు వైపు వంతెన పనులు ఆగిపోయాయి. ఏటా వర్షాలకు మూలవాగు ఉధృతంగా ప్రవహించడంతో నిర్మాణ పనులకు అడ్డంకిగా మారి జాప్యం నెలకొంటుంది. ఏళ్లు గడుస్తున్న కొద్దీ నిర్మాణ వ్యయం అంచనాలు పెరిగిపోతున్నాయి. దీంతో పాత అంచనాలతో చేయలేమని గుత్తేదారు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రోజూ వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. వీరికి రవాణా పరంగా అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వేములవాడ మూలవాగు పాత వంతెనకు ఇరువైపులా రెండు వంతెనల నిర్మాణంతో పాటు వాటి వద్ద కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టేందుకు 2015లో కోర్‌నెట్ నిధులు రూ. 28 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రెండు వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించి, పనులకు శ్రీకారం చుట్టారు. ఆధ్యాత్మికత ఉట్టి పడేలా వంతెనలు డిజైన్ చేయడంతో పాటు పాత వంతెనకు ఇరువైపులా 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో నిర్మించడానికి రూపకల్పన చేశారు. రెండు వంతెనల చివర కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. పడమటి వైపు పూర్తి చేసి దాదాపు అయిదేళ్లు అవుతున్నా తూర్పు వైపు వంతెన నిర్మాణ పనులు ఆగుతూ సాగుతూ వస్తున్నాయి. అయిదు పిల్లర్లకు గాను కేవలం మధ్యలో రెండు మాత్రమే పూర్తి చేశారు. రెండో వంతెన నిర్మాణం మొదలు పెట్టినప్పటి నుంచి ఒక్కసారి కూడా సజావుగా పనులు సాగిన దాఖలాలు లేవు. వంతెనకు ఇరువైపులా భూసేకరణ నేటికీ పూర్తి కాకపోవడం జాప్యానికి మరో కారణంగా అధికారులు చెబుతున్నారు. మొదటి నుంచి పిల్లర్లను నిర్మించాల్సి ఉండగా భూసేకరణ కాక వాగు మధ్యలో మొదలు పెట్టి రెండు పిల్లర్లను



పూర్తి చేయడం గమనార్హం.

మూడుసార్లు కొట్టుకుపోవడంతో...రెండో వంతెన నిర్మాణానికి ఏటా అంతరాయం ఏర్పడుతోంది. సెంట్రింగ్ పనులు చేపట్టే దశలోనే భారీ వర్షాలకు సపోర్టు పైపులు కొట్టుకుపోయి మూడు సార్లు కూలిపోయింది. మొదట బీములపై స్లాబ్ వేసే దశలో సెప్టెంబరు 2019లో భారీ వర్షాలకు సెంట్రింగ్ సపోర్టు కర్రలు కొట్టుకుపోయి బీమ్ వంగిపోయి కూలింది. అప్పటి నుంచి భారీ వర్షాలకు బీమ్‌ల నిర్మాణాకి స్టీల్ అల్లుతున్న క్రమంలో సపోర్టు కర్రల అడుగు భాగంలో ఇసుక కొట్టుకుపోయి కుంగిపోవడం, కొట్టుకుపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో గుత్తేదారు నష్టాన్ని చవిచూశారు. ఈ వంతెన నిర్మాణం 2018లోనే పూర్తి కావాల్సి ఉంది. అధికారుల్లో ముందు చూపు లేక, గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల నేటికీ పూర్తి కాని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.గుత్తేదారు ముందుకు రావడం లేదునిర్మాణ వ్యయం పెరిగిపోవడంతో పాత అంచనాలతో పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడం లేదు. వంతెనలకు ఇరువైపులా భూసేకరణ కూడా పూర్తి కాలేదు. వంతెన బ్యాలెన్స్ అంచనాలతో తిరిగి టెండర్లు పిలిచి పనులు చేపట్టే ప్రక్రియకు చర్యలు తీసుకుంటున్నాం.– శాంతయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, వేములవాడ



## రాహుల్ జీ.. ఆ సీటుపై మీ బావ కన్నేశారు..!

### బావ కన్నేశాడు.. రాహుల్‌జీ కర్చీఫ్ వేయండి: స్మృతి ఇరానీ కౌంటర్

దిల్లీ: ఒకప్పటి పార్టీ కంచుకోట అయిన ఉత్తరప్రదేశ్‌లోని అమేఠీ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఇక్కడి నుంచి ఆ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా పోటీ చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై భాజపా ఎంపీ స్మృతి ఇరానీ తాజాగా స్పందిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు.

అమేఠీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్మృతి.. హస్తం పార్టీపై మరోసారి విరుచుకుపడ్డారు. "ఇలా ఎప్పుడైనా జరిగిందా? పోలింగ్‌కు ఇంకా 27 రోజులే ఉంది. కానీ, ఇంకా కాంగ్రెస్ తమ అభ్యర్థిని ప్రకటించకపోవడం వారి అహంకారానికి నిదర్శనం. ఈ స్థానంపై రాహుల్ గాంధీ బావ (రాబర్ట్ వాద్రాను ఉద్దేశిస్తూ) కన్నేశారు. ఇప్పుడు ఆయన ఏం చేస్తారో? ఒకప్పుడు ప్రజలు బస్సుల్లో వెళ్లే సమయంలో సీట్ల కోసం కర్చీఫ్ వేసుకునేవారు. ఇప్పుడు రాహుల్ కూడా తన సీటును బుక్ చేసుకునేందుకు అలానే చేయాలేమో మరి" అంటూ కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఐదో విడత పోలింగ్‌లో భాగంగా అమేఠీ స్థానానికి మే 20వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. సిట్టింగ్ ఎంపీగా ఉన్న స్మృతి ఇరానీ వరుసగా రెండో సారి భాజపా తరఫున పోటీ చేస్తున్నారు. 2019 కంటే ముందు వరుసగా మూడు సార్లు రాహుల్ విజయం సాధించిన విషయం తెలిసిందే. గతంలో గాంధీ కుటుంబ సభ్యులు సోనియా, రాజీవ్, సంజయ్ కూడా ఇక్కడి నుంచి గెలుపొందారు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు మంచి పట్టున్న ఈ ప్రాంతంలో ఇప్పుడు హస్తం ఆదరణ కోల్పోతూ వస్తోంది. గత ఎన్నికల్లో అమేఠీలో రాహుల్ ఓటమి ఆ పార్టీని గట్టిగా దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే తాజా ఎన్నికల్లో వారి కుటుంబసభ్యులు ఇక్కడి నుంచి పోటీ చేస్తారా? లేదా? అన్నది సందిగ్ధంగా మారింది. ఇదే సమయంలో ఇటీవల రాబర్ట్ వాద్రా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

అమేఠీ ప్రజలు తన ప్రాతినిధ్యాన్ని కోరుకుంటున్నారని, ఇక్కడ తన అభ్యర్థిత్వంపై సరైన సమయంలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. మరోవైపు రాహుల్ ఇక్కడి నుంచి పోటీపై స్పందిస్తూ.. పార్టీ చెప్పినట్లే నడుచుకుంటానని అన్నారు. ఆయన ప్రస్తుతం బరిలో ఉన్న కేరళలోని వయనాడ్ స్థానానికి ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. ఇక అమేఠీలో నామినేషన్ సమర్పణకు మే 3 చివరి తేదీ. దీంతో వయనాడ్ పోలింగ్ తర్వాత అమేఠీలో రాహుల్ పోటీపై ప్రకటన వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.



## మానేరు వాగుపై కూలిన నిర్మాణంలోని వంతెన

ముత్తారం: పెద్దపల్లి జిల్లాలో మానేరు వాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. ముత్తారం మండలం ఓడేడు పరిధిలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఓడేడు నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి మధ్య దూరం తగ్గించేందుకు వాగుపై ఈ వంతెన నిర్మిస్తున్నారు. 2016లో పనులు ప్రారంభమయ్యాయి. మధ్యలో కాంట్రాక్టర్లు మారడం, నిధుల లేమి తదితర కారణాలతో నిర్మాణం ఆలస్యమవుతూ వస్తోంది. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గంలో స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వంతెన కూలడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పగటివేళ రాకపోకల సమయంలో కూలి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని చెబుతున్నారు. వంతెన నిర్మాణం నాణ్యతపై విమర్శలు వస్తున్నాయి. పిల్లర్లు, గట్టర్లకు మధ్య బ్యాలెన్సింగ్ కోసం పెట్టిన చెక్క ముక్కలు చెదలు పట్టాయి. దీంతో గట్లర్లు ఒకవైపు వంగినట్లు తెలుస్తోంది. చాలా రోజులుగా నిర్మాణం చేపట్టకపోవడంతో బ్యాలెన్స్ తప్పి కూలినట్లు సమాచారం.

## 'బిడ్డా సంజయ్.. నా తల్లిని తిడతావా'.. బండిపై పొన్నం ఫైర్



కరీంనగర్, ఏప్రిల్ 23: తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు హీటెక్కిస్తున్నాయి. ముఖ్యంగా కరీంగనర్ జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, బీజేపీ ఎంపీ బండి సంజయ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితి. ఎన్నికల్ల ప్రచారంలో భాగంగా ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. నువ్వెంత అంటే.. నువ్వెంత అన్న రేంజ్‌లో ఒరిపై ఒకరు దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి పొన్నం సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేతల పట్ల కూడా బండి సంజయ్ వ్యవహార శైలి సరిగా లేదంటూ వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బండి సంజయ్‌కు ఈటెల రాజేందర్‌కు విభేదాలున్నాయని అన్నారు. అలాగే మురళీధర్ రావుతోనూ సంజయ్‌కు విభేదాలు ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కరీంనగర్ జిల్లా నేతలను కూడా ఎంపీ దూరం పెట్టారన్నారు. "బిడ్డా బండి సంజయ్ నీకు చదువు రాదు.. భాష రాదు. నా తల్లిని తిడుతావా.. మహిళలను అవమానిస్తావా" అంటూ విరుచుకుపడ్డారు. బండి సంజయ్ పదో తరగతి ఎక్కడ చదివారని ప్రశ్నించారు. తిరుపతికి కరీంనగర్ నుంచి అదనంగా రైలు నడిపావా అంటూ పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



## జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

దిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఈ కేసులో ఇద్దరికీ మరో 14 రోజుల పాటు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మే 7న ఈ నేతలిద్దరినీ కోర్టు ఎదుట హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. 2021-22 నాటి దిల్లీ మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ గత నెలలో ఈడీ అధికారులు కవిత, కేజ్రీవాల్‌ను వేర్వేరు తేదీల్లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత వీరిద్దరూ తిహాడ్ జైలులోనే ఉంటున్నారు. మరోవైపు, ఇటీవల సీబీఐ కవితను తన కస్టడీకి తీసుకొని విచారించిన విషయం తెలిసిందే.

**సూర్యాస్తమయం లోపే కవితను అరెస్టు చేశాం.. ఈడీ వాదనలు :** ఇదిలాఉండగా.. కవిత బెయిల్ పిటిషన్‌పైనా దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. ఈడీ తరఫున జోయబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కవితకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. కవిత అరెస్టు చట్టబద్ధంగానే జరిగిందని, సెక్షన్ 19కి అనుగుణంగా జరిగినట్లు ఈడీ తరఫు న్యాయవాది వివరించారు. " కవితను అరెస్టు చేయవద్దని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వలేదు. 2023 సెప్టెంబర్ 26న ఈడీ తదుపరి 10 రోజులు సమన్లు ఇవ్వబోమని అండర్ టేకింగ్ ఇచ్చింది. మార్చి 15న సాయంత్రం 5.20 గంటలకు ఆమెను అరెస్టు చేశాం. తనపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను మార్చి 19న ఆమె ఉపసంహరించుకున్నారు. కవితకు వ్యతిరేకంగా శరత్‌చంద్రారెడ్డి, బుచ్చిబాబు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవ వాంగ్మూలాలు ఇచ్చారు. కవితను సూర్యాస్తమయం లోపే అదుపులోకి తీసుకున్నాం. కవిత అరెస్టు సాయంత్రం 5.20గంటలకు జరిగింది. కవిత అరెస్టు రోజు హైదరాబాద్‌లో సూర్యాస్తమయం సాయంత్రం 6.26గంటలకు అయ్యింది. ఇండోస్పిరిట్స్ కంపెనీలో కవిత బినామీగా అరుణ్ పిళ్లై ఉన్నారు. అరెస్టుకు గల కారణాలు చెప్పి కవిత సంతకం తీసుకున్నాం. అరెస్టు చేసిన 24గంటల్లో కోర్టులో హాజరుపరిచాం. సౌత్‌గ్రూప్‌లోని ఇతర వ్యక్తులకు ప్రేమ్ మండూరి బినామీగా ఉన్నారు" అని ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణను కోర్టు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. ఈడీ వాదనలు పూర్తయిన తర్వాత కవిత తరఫు న్యాయవాదులు కౌంటర్ వాదనలు వినిపించనున్నారు.

## ఆమెతో నాకు పోటీనా.. డీకే అరుణపై సీఎం రేవంత్ పంచులు



నారాయణ పేట జిల్లా: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్, బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. మంగళవారంనాడు బీజేపీ మహబూబ్ నగర్ అభ్యర్థి డీకే అరుణపై పంచుల వర్షం కురిపించారు. నారాయణ పేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి.. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ క్యాడర్‌కు పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎన్నికలకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు 7 వేల మెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యే చేశారని.. నేడు 30 వేల మెజార్టీతో సీఎంగా చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ మనపై ప్రేమతో సీఎం పదవి ఇచ్చారని.. టీపీసీసీ చీఫ్ పదవి ఏకకాలంలో ఇచ్చారని తెలిపారు. చేయి చాపి అడిగే స్థాయి నుంచి.. ఇప్పుడు రాష్ట్రంలో ఏది కావాలన్నా ఇచ్చే స్థాయికి ఈ కొడంగల్ ఎదిగిందని ఉద్ఘాటించారు. కొడంగల్‌ను దొంగ దెబ్బ తీసేందుకు బీజేపీ బీఆర్ఎస్ నాయకులు కుట్ర చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఆనాడు మంత్రిగా ఉన్న అరుణ.. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. తాను సీఎంను.. తనకు పాలమూరులో శత్రువులు.. ప్రత్యర్థులు ఎవ్వరూ లేరని చెప్పుకొచ్చారు. డీకే అరుణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నరేంద్ర మోదీ కత్తివై పాలమూరు కడుపులో పొడిచేందుకు ప్రయత్నిస్తుంది. ఆమె(డీకే అరుణ)తో నాకు పోటీ లేదు. మీ సొంత ఊరిలోనే మీ పార్టీ డిపాసిట్ కొల్పోయింది.. మీకు నాకు ఏం పోటీ' అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో మోసం పార్ట్-2 సీక్వెల్ నడుస్తోంది : కేటీఆర్



రంగారెడ్డి : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మోసం పార్ట్-1 నడిచింది.. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోసం పార్ట్-2 సీక్వెల్ నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పంద్రాగస్టు లోగా రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసానికి యత్నిస్తుందని ఆయన తెలిపారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణలో 17 ఎంపీ స్థానాలకు గానూ 12 స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయేకు 220 సీట్లు, యూపీఏ 150 సీట్లు దాటే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి 12 సీట్లు కట్టబెడితే.. అటు ఎన్డీఏ, ఇటు యూపీఏ ఇద్దరూ కేసీఆర్ వద్దకు వచ్చి దండం పెడుతారు. తెలంగాణకు ఏం కావాలంటే అది చేస్తాం.. మాకు మద్దతివ్వండి అనే పరిస్థితి వస్తుంది. కాబట్టి ఈ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు గట్టిగా పోరాడి మెజార్టీ స్థానాల్లో గెలిచే ప్రయత్నం చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

**పార్టీ నుంచి పిరికిపందల్లా జారుకున్నారు..** బీఆర్ఎస్ ప్రభుత్వంలో రంజిత్ రెడ్డి ఎంపీగా, పట్నం మహేందర్ రెడ్డి మంత్రిగా పదవులు అనుభవించిన వారు తల్లి లాంటి పార్టీకి మోసం చేశారు. ఈ ఎన్నికల్లో రంజిత్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. అధికారం పోగానే పార్టీ నుంచి పిరికిపందల్లా జారుకున్నారు. 93 కులాలను ఐక్యం చేసిన బాహుబలి కాసాని జ్ఞానేశ్వర్. ఒక బలమైన నాయకుడు బలహీన వర్గాలకు గొంతుకై నిలబడ్డాడు. అలాంటి కాసానిని గెలిపించాలి. బలహీన వర్గాలకు రాజ్యాధికారం కావాలంటే కాసానిని గెలిపించి బీసీల సత్తా చూపించాలన్నారు కేటీఆర్.

## శ్రీరామ చంద్రుణ్ణి అందరూ దర్శించుకోవచ్చు.. హనుమాన్ శోభాయాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 23: నగరంలోని గౌలిగూడ మందిర్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. గౌలిగూడ నుంచి సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు యాత్ర సాగింది. దాదాపు 13 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది.

అయితే శోభాయాత్రను పురస్కరించుకుని గౌలిగూడ రామ మందిర్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీమంత్రి ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అయోధ్యలో రాం మందిర్ ఏర్పాటు తర్వాత వచ్చిన మొదటి హనుమాన్ జయంతిని దేశవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో చేసుకుంటున్నారన్నారు. 550 ఏళ్ళ తర్వాత రాం మందిర్‌లో దివ్యమైన రాముణ్ణి ప్రతిష్టించుకున్నామని తెలిపారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది వైభవంగా హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందన్నారు. రాముడు దేశంలోని 140 కోట్ల మందికి దేవుడన్నారు. అందరూ శ్రీరామ చంద్రుణ్ణి దర్శించుకోవచ్చని వెల్లడించారు.



## ఈ దేశాన్ని అలంకరించాం.. చొరబాటుదారులం కాదు: అక్బరుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్: ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలకు ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ కౌంటర్ ఇచ్చారు. తాము చొరబాటుదారులమని, ఎక్కువ మంది పిల్లల్ని కంటామని ప్రధాని మోదీ విమర్శిస్తున్నారని, కానీ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఎంత మంది సోదరులు ఉన్నారో తెలుసా అని ప్రశ్నించారు. ముస్లింలకు ఎక్కువ మంది పిల్లలు ఉండడం కాదు, వాజ్‌పేయికి ఏడు మంది సోదరసోదరీమణులు ఉన్నారని, యోగి ఆదిత్యనాథ్ ఇంట్లో కూడా ఏడు మంది ఉన్నారని, అమిత్ షా ఇంట్లో కూడా ఏడు మంది ఉన్నారని, ప్రధాని నరేంద్ర మోదీకి ఆరు మంది సోదరులు ఉన్నారని అక్బరుద్దీన్ అన్నారు. ఈ దేశానికి తాజ్ మహల్, ఖుతుబ్ మినార్, రెడ్ ఫోర్ట్, జామా మసీదు, చార్‌మినార్ ఇచ్చామని, ఈ దేశాన్ని అద్భుతంగా అలంకరించామని, తామేమీ చొరబాటుదారులం కాదు అని అన్నారు. ఈ దేశానికి తాము చెందుతామని, ఇది తమ దేశమని, ఎప్పటికీ తమదే అవుతుందని అక్బరుద్దీన్ తెలిపారు.




PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660